بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 08.04.2016 (Telugu)

**మనలను వీరు ఇష్టానుసారము ముస్లిములన్నను లేదా ముస్లిమేతరులన్నను అల్లాహ్ తఆలా చేసిన పరిచయము ప్రకారము కూడ, ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన పరిచయము ప్రకారము కూడ మనము స్వచ్ఛమైన ముస్లిములము. ఈ పేరును ఉచ్ఛరించుటకు ఎవరు నిరాకరించలేరు.**

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 08.04.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

మన కార్యములు, మన కర్మలు, మన నిర్ణయములు ఖుర్ఆన్, హదీస్ ప్రకారము యున్నవా లేవా అని పరీక్షించుకోవలెనని, ఏదేని విషయములో మానవుడు గ్రహించగా ఖుర్ఆన్, హదీస్‌తో వివరణ లభించనిచో ఆయా పనులను ఎలా నిర్వహించవలెనని ఒక సారి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. ఇందుకు గడిచిన పాత విద్యావంతుల వాక్యములు, నిర్ణయములను అవలంభించవలెను. ఈ విషయములో ఇంకను వారిట్లనిరి. మేము మా సమస్యల గూర్చి నిర్ణయములు ఎలా తీసుకోవలెను, ఎక్కడి నుండి మార్గదర్శనము పొందవలెనని ఒక సారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను అడగగా వారిట్లనిరి. మా పద్ధతి ఏమనగా అన్నిటికంటే ముందు పవిత్ర ఖుర్ఆన్ ప్రకారము నిర్ణయము తీసుకోవలెను, ఖుర్ఆన్‌లో ఏదేని విషయము లభించనప్పుడు దానిని హదీసులో అన్వేషించవలెను. హదీసులో కూడ ఏదేని విషయము లభించనప్పుడు సమాజ వివరణ ప్రకారము నిర్ణయము తీసుకోవలెను. ఇవ్వబడిన నిదర్శనముల ప్రకారము నిర్ణయము తీసుకోవలెను. ఇక్కడ మరో విషయము స్పష్టము చేయదలచినదేమనగా సున్నత్‌నకు హదీస్‌పై ఆధిక్యత గలదని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తెలిపిరి. సున్నత్ ప్రకారము రుజువైన విషయములను ఆచరించవలసినదే. అనంతరం హదీస్ వంతు వచ్చును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసి చూపిన, తరువాత సహాబాలు (అనుచరులు) నేర్చుకున్న, తరువాత సహాబాల నుండి తాబయీన్, తాబయీన్ నుండి తబతాబయీన్ (అనుచరుల తరువాతి తరం) నేర్చుకొని సమాజములో కొనసాగినవే సున్నత్. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలుపునదేమనగా మనము అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త అనుమతించిన పనులనే చేయవలెనని మన జీవితములను సమీక్షించవలెను. కొందరికి కొన్ని సార్లు పుణ్యము నెత్తికెక్కును. ఇందులో ఎంత వరకు ముందుకెళ్ళుదురనగా మితిమీరి ప్రవర్తింతురు. తమ ప్రాణమును సంకటములో పడవేయుదురు. లేదా తమపై దౌర్జన్యము చేయుదరు. లేదా కొందరు, కొందరే కాదు అధికులు అల్లాహ్ అతని ప్రవక్త ఆదేశములను చిన్నచూపు చూచుదురు. వాటిని ఆచరించుటకు శ్రద్ధ వహించవలసినంత శ్రద్ధ వహించరు. ఈ రెండు రకాల ప్రజలలో కొందరు మితిమీరగా కొందరు అసలే వెనుకడుగు వేయుదురు. ఇలా అల్లాహ్ అతని ప్రవక్త ఆదేశములను దాటి పోవుదురు. పుణ్యములో ముందడుగు వేయు వారి ఉదాహరణలు కూడ యుండును. ఒక స్త్రీ ఉదాహరణ వారిచ్చిరి. అక్రమ పద్ధతిలో ఒక సత్కార్యము చేయదలచెను. వాస్తవానికి అది పుణ్యము కాదు. ఎందుకనగా దేవుడు అతని ప్రవక్త అందుకు అనుమతించలేదు. తమ స్వప్నములకు అధిక ప్రాధాన్యతనిచ్చేవారి కొరకు కూడ నేను ప్రస్తావించే సంఘటనలో గుణపాఠము గలదు. వారి ప్రతి స్వప్నము సత్యమైనదని, ఏదో అర్థముందని చెప్పే విధముగా వారి స్థాయి కాదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈనాడు ఒక స్త్రీ మా వద్దకు వచ్చెను. ఆమె మెదడులో కొంత లోపమున్నది. ఆమె ఇట్లనెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వచ్చి నీవు కొన్ని నెలలు వరుసగా ఉపవాసములున్నచో ఖలీఫతుల్ మసీహ్‌కి స్వస్థత కలుగునని చెప్పినట్లు నేను స్వప్నములో చూచితిని. ఆరంభములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) అనారోగ్యము గురించి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఆమెతో నేనిట్లంటిని. నీ స్వప్నము హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) దైవవాణుల కంటే గొప్ప కాదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ దైవవాణీల గురించి ఇట్లనిరి. ఏదేని నా దైవవాణి ఖుర్ఆన్, సున్నత్‌నకు విరుద్ధముగా యున్నచో నేను దానిని నంజు వలె పారవేయుదును. స్వరము నుండి శుభ్రము చేసి పారవేయుదును. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ దైవవాణిని పవిత్ర ఖుర్ఆన్, సున్నత్‌నకు ఇంత అనుకూలంగా

చేసినప్పుడు మనము కూడ తమ స్వప్నమును వారి ఆదేశములకనుగుణంగా చేయవలెను. కనుక స్వప్నము పవిత్ర ఖుర్ఆన్ లేదా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నిర్ణయము, సున్నత్‌నకు విరుద్ధముగా యున్నచో రద్దు చేయబడును. ఎందుకనగా పవిత్ర ఖుర్ఆన్‌కు విరుద్ధముగా యున్న ఏ స్వప్నము సత్యము కారాదు, సరియైన హదీసుకు విరుద్ధముగా ఏ స్వప్నము సత్యము కారాదు. పుణ్యము గురించి అయినను స్వప్నములను పునాదిగా తీసుకోకూడదు, తమను తాము శక్తిని మించి ప్రమాదములో పడవేయుట సరియైన విషయము కాదు. తప్పు మాత్రమే కాదు, అసమంజస కార్యమగును. కొన్ని సార్లు పాపమగును. అల్లాహ్ తఆలా ఎవరిని ఎన్నుకోదలచెనో వారితో ప్రత్యేకంగా వ్యవహరించును. అది సామాన్య ప్రజలతో యుండదు. వారిని ఒక సామాన్య వ్యక్తితో పోల్చరాదు. ఈ సంఘటనతో ఒకరికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆరు మాసముల వరకు ఉపవాసములుండిరను ఆలోచన రావచ్చును. దీని గురించి స్పష్టము చేయదలచినదేమనగా ఒకటి వారిని దేవుడు ప్రవక్తృత్వ స్థానమున నిలుపదలచెను. దీని గురించి స్వయముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) చెప్పినదేమిటి ? మనకు ఉపదేశించినదేమిటో నేను ప్రస్తావింతును. వారిట్లనిరి. ఇలా చేయాలని నేను ప్రతి ఒక్కరికి సలహా ఇవ్వలేను. నేను కూడ నా ఇష్టముతో ఇలా చేయలేదు. నేను స్పష్టమైన స్వప్నముతో అల్లాహ్ తఆలాతో సమాచారము పొంది శారీరక కఠినత్వము అలవర్చుకొనులో భాగంగా ఎనిమిది లేదా తొమ్మిది నెలల వరకు ఉపవాసములున్నాను. ఆకలి, దాహమును చవి చూచితిని. అనంతరం ఈ పద్ధతిని సదా ఆచిరించకుండా వీడితిని. వారికి దేవుడు ఈ స్థాయి అనుగ్రహించవలసి యుండెను. అందుకే అనుమితచ్చెను. తరువాత వారు దీనినెన్నడు కూడ పాటించలేదు. అప్పుడప్పుడు ఉపవాసములు యుండేవానిని. ఇలా చేయకూడదని నేను ఇతరులకు, నన్ను నమ్మేవారికి కూడ చెప్పితిని.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై చేయు మరో ఆరోపణ ఏమనగా వారొచ్చి ఒక జమాఅత్ స్థాపించి అశాంతిని సృష్టించిరి, వారి వాక్యము ప్రకారము ముస్లిములలో 73వ వర్గమును ఏర్పాటు చేసిరి. విభేదమును దూరము చేయవలసిన తరుణంలో తిరిగి క్రొత్త వర్గమును ఏర్పాటు చేసిరి. సందేశహరుల అవతరణ సమయంలో ఇటువంటి మాటలు తలెత్తునను విషయమును గుర్తుంచుకోవలెను. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై ఇవే ఆరోపణలు చేయబడినవి. సోదరున్ని సోదరునితో దూరము చేసిరి, మాలో పరస్పరము ఎడబాటు, వర్గములు, శత్రుత్వములను సృష్టించిరి. వాస్తవానికి పీడన స్థితి వారిలో గతములోనే యుండెను. ఇదే స్థితి నేటి ముస్లిములది యుండెను. ఇప్పటికి పీడన స్థితి గలదు. పీడన స్థితిని దూరము చేయుటకు సందేశహరున్ని దేవుడు పంపును. ఒక్క హస్తముపై ఏకమై వీరు ఏకమగుటకు ప్రయత్నింతురు. కనుక విశ్వసించేవారు శాంతిలో చేరుదురు, ఏకమగుదురు, పీడనముల నుండి విముక్తి పొందుదురు. ఇతరులు అనగా వ్యతిరేకులు పీడనములలో చిక్కుకొందురు. మనకు వ్యతిరేకంగా ఇష్టమొచ్చినంత వ్యతిరేకత ఏకమై వహించినను వీరు పరస్పరం కూడ విడిపోయి యున్నారు. ఒక్కటిగా లేరు, పరస్పరం కూడ జగడమాడుదురు. ఇమామ్‌ను వీరు నమ్మనంత వరకు ఇలాగే జరుగుచుండును. మనలను వీరు ఇష్టానుసారము ముస్లిములన్నను లేదా ముస్లిమేతరులున్నను అల్లాహ్ తఆలా చెప్పిన భావము ప్రకారము కూడ, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పిన భావము ప్రకారము కూడ మనము స్వచ్ఛమైన ముస్లిములము. ఈ పేరును ఉచ్చరించుటకు ఎవరు ఆపలేరు. ఈ పీడనముల స్థితిని సూచించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లు ప్రస్తావించిరి. ఒక మిత్రుడు ఇట్లు తెలిపెను. హనఫీయుల మస్జిద్‌లో ఒక అహ్లె హదీస్ వారితో కలిసి నమాజ్ చదువుచుండెను. అత్తహియ్యాత్‌లో అతడు తషహ్హుద్ సమయమున వ్రేలు లేపెను. అతను వ్రేలు లేపిన వెంటనే వెనుక నమాజ్ చదువుచున్న వారందరు అతనిపై ఎగబడి హరామీ హరామీ అని అరవడం మొదలు పెట్టిరి. హనఫీయుల ఒక విశ్వాసమేమనగా తషహ్హుద్ సమయమున వారు వ్రేలు లేపరు. నమాజ్ చదువుచున్నామని వారు చూడలేదు, నమాజ్ వీడుట ఎంత నేరమో ఆలోచించలేదు. నమాజ్ విడిచి అతని వ్రేలునే చూచుచుండిరి. నమాజ్ వీడి అతన్ని దూషించడం మొదలు పెట్టిరి. అనంతరం అతన్ని దండించడం కూడ ప్రారంభించిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈ పీడనము హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రాక ముందు నుండే యుండెను. మసీహ్ మౌవూద్ (అ) వచ్చి సంస్కరించిరి. వారిట్లనిరి. ఒక వ్యక్తి ఇదే వర్గపోరు గురించి వారిని ప్రశ్నించెను. మీరొచ్చి వర్గపోరు మరింత పెంచిరి. గతములోనే ఇంత పీడనము వ్యాపించి యుండెను. వారిట్లనిరి. సరే పాలను భద్రపరచుటకు పెరుగుతో కలిపిపెడతారా లేదా విడిగా పెడతారా ? పాలను భద్రపరచుటకు పెరుగు నుండి దూరముగా పెట్టెదరు. లేనిచో ఏదేని చుక్కలు పడి పాలు చెడిపోయె ప్రమాదముండును. పెరుగుతో మంచి పాలు ఒక్క క్షణం కూడ మంచిగుండలేవు. కనుక చెడిపోయిన సంస్థ నుండి మంచి సంస్థను విడిగా యుంచవలసిన అవసరముండెను. స్థాపించిన లేదా విడిగా చేసిన ఈ సంస్థ ఒక అవతారుని సంస్థ. చెడిపోయిన వారితో దీనిని విడగొట్టుట అనివార్యము.

ఎలాగైతే రోగి నుండి జాగ్రత్త పడనిచో ఆరోగ్యముతో యున్న వ్యక్తి కూడ వ్యాధికి గురగును. ఇలాగే ఆధ్యాత్మిక వ్యాధుల నుండి అవతారుని సంస్థను విడిగా యుంచుట దేవుని ఆచారము. అల్లాహ్ తఆలా ఇట్లనెను. يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا قُوا أَنفُسَكُمْ وَأَهْلِيكُمْ نَارًا అనగా తమను తమ కుటుంబమును అగ్ని నుండి రక్షించుము. హజ్రత్ మసీహ్ (అ) స్త్రీ అనుచరులు అహ్మదియేతరునితో వివాహము చేయబడినచో భర్త వలన ఆమె నిశ్చయముగా అహ్మదియ్యత్ నుండి దూరమగును లేదా దూరము కానిచో కుమిలి కుమిలి చనిపోవును. లేనిచో గృహములో ఆమెతో కఠినముగా వ్యవహరించబడును.

అహ్మదీయులు ఇతరులతో వివాహ సంబంధములు కుదుర్చుకోకపోవడం ఆరోపించవలసిన విషయం కాదు, తమను తాము రక్షించుకోవడమే. ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చు ప్రయత్నమే. కాని ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చు స్ఫూర్తి గల వ్యక్తికి మాత్రమే ఈ ఆలోచన కలుగును. ఇందులో అహ్మదీ అమ్మాయిలను వీడి అహ్మదియేతర అమ్మాయిలను వివాహమాడే అబ్బాయిలు కూడ ఇందులో యున్నారు. కావున తమను తాము అహ్మదీయులనబడు, స్వచ్ఛమైన అహ్మదీయులైనచో కేవలము తమ స్వంత కోరికలను మాత్రమే చూడకూడదు. వివాహ వయసునకు చేరినచో అహ్మదీ అమ్మాయిలను వివాహమాడుము. తమ ప్రాపంచిక కోరికలపై తమ భావితరాలకు, ధర్మమునకు ప్రాధాన్యతనివ్వుము. యదార్థమేమనగా అమ్మాయిలు మాత్రమే ఇతరులలో పోయినందుకు తరాలు నాశనం కావు, అబ్బాయిలు ఇతరులలో పోయినందుకు కూడ తరాలు నాశనమగును. సమాజ ఒత్తిడి లేదా బంధుత్వ ఒత్తిడ వలన అహ్మదీ కాకూడదు, ధర్మమును అర్థము చేసుకొని అహ్మదీ అగుటకు ప్రయత్నించవలెను. అహ్మదీ అబ్బాయిలు బయట వివాహములు చేసుకొన్నచో అహ్మదీ అమ్మాయిలు ఎక్కడికి పోవలెను. కావున అబ్బాయిలు కూడ గ్రహించవలసిన అవసమున్నది. నేడు ఇటువైపు ధోరణి చాలా మళ్లినది. ఇప్పుడు కూడ ఈ విషయములో జాగ్రత్త వహించనిచో మున్ముందు ఈ ధోరణి మరింత పెరుగును. అల్లాహ్ తఆలా ప్రత్యేక అనుగ్రహము యున్నచో తప్ప తరువాతి తరంలో అహ్మదియ్యత్ మిగలదు. అహ్మదీ అమ్మాయిల, అబ్బాయిల పేర్లు ఒక రిజిస్టరులో నమోదు చేయాలని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సూచించిరి. ఒక వ్యక్తి సూచించినందున వారీ రిజిస్టరు తెరిపించిరి. అతడిట్లు వేడుకొనెను. మన జమాఅత్ వేరే అయినందున ఇతరులలో వివాహ సంబంధములు చేసుకోకూడదని మీరు తెలిపిరి. కనుక వివాహములలో కఠిన ఇబ్బందులు ఎదురగుచున్నవి. ఇప్పుడేమి చేయగలము. వివాహములు కాని అమ్మాయిల, అబ్బాయిల పేర్లు ఒక రిజిస్టరులో నమోదు చేయవలెను. తద్వారా వివాహ సంబంధములలో సౌలభ్యము ఏర్పడును. ఈ ప్రతిపాదన చేసిన వ్యక్తికి ఒక కూతురుండెను. ఒక వివాహ సంబంధము రాగానే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆ వ్యక్తి ఇంటికి వివాహ సంబంధము పంపించిరి. కాని అతడు నమ్మశక్యం కాని సాకు తెలిపి వివాహ సంబంధమును నిరాకరించెను. అమ్మాయి వివాహము ఎక్కడో అహ్మదీయేతరులలో చేయించెను. హజ్రత్ గారికి ఈ విషయము తెలియగా నేటి నుండి నేను వివాహ సంబంధములలో జోక్యము కల్పించుకోననిరి. ఇలా ఆ ప్రతిపాదన అసంపూర్తిగా మిగిలిపోయెను. కాని అప్పుడు ఆ విషయము జారీ అయినచో నేడు అహ్మదీయులకు కలుగుచున్న ఇబ్బంది కలుగకపోయేది. ఒక్కోసారి ప్రవక్త ముందట చేయబడిన ఒక అవిధేయత జమాఅత్ కొరకు ఆపదగా మారును. అమ్మాయిలు, అబ్బాయిలు ఇరువురు రాజీ అయినను తమ గర్వము వలన అహ్మదీయుల వివాహ సంబంధములను తిరస్కరించేవారు కూడ కొందరున్నారు. వాస్తవానికి కొన్ని సార్లు నేను కూడ సంబంధము కుదుర్చుకొమ్మని చెప్పినాను. కాని గర్వము వలన నిరాకరించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మాటను నిరాకరించిన వారుండగా నా మాటను నిరాకరించుట పెద్ద విషయమేమి కాదు. కాని ఇటువంటి వ్యక్తుల ఫలితము చాలా భయంకరముగా యుండును. అహ్మదీ అమ్మాయిలు, అబ్బాయిలు వివాహమాడదలచినచో వారి తల్లిదండ్రులు మొండితనము చూపరాదు. కుటుంబ, గర్వముల వలయములో పడకూడదు. వివాహము గురించి మరో విషయమును స్పష్టము చేయవలసియున్నది. అనగా వివాహములో అమ్మాయి ఇష్టమును కూడ దృష్టియందుంచుకోవలెను, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అమ్మాయి ఇష్టమును చేర్చుటను ఇష్టపడిరి. కాని సంరక్షకుని ఇష్టము లేకుండా వివాహము జరపకూడదను నియమమును ఇస్లాం విధించెను. కొన్ని విషయములలో శాసనము మినహాయింపు ఇచ్చెను. కేవలం అమ్మాయి ఇష్టమును చూచి సంరక్షకుని అనుమతి లేనిదే వివాహము జరుపుట శాసనమునకు విరుద్ధమని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తెలిపిరి. ఇంతకు ముందు తెలిపినట్లు కేవలం గర్వము వలన వివాహ సందబంధమును తిరస్కరించుచు తల్లిదండ్రులు అనవసరముగా, హత్యల వరకు చేరు విధముగా మొండిగా వ్యవహరించకూడదు. స్వయముగా ఇంటి నుండి వెళ్లి న్యాయస్థానములకు చేరి లేదా ఒక మౌల్వీ వద్దకు వెళ్లి వివాహము చేసుకొనుట, నికాహ్ చదివించుకొను అనుమతి కూడ అమ్మాయిలకు ఇస్లాం ఇవ్వదు. విధిలేని

స్థితులు యున్నచో అమ్మాయిలు కూడ వర్తమాన ఖలీఫాకు వ్రాయవచ్చును. స్థితిగతులను బట్టి సరియైన నిర్ణయము అతడు చేయును.

ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతినిచ్చు సూత్రమును పాటించినచో, అబ్బాయిలు కూడ పాటించనచో అల్లాహ్ తఆలా కూడ అనుగ్రహించును. ఒక ఖుత్బాలో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) దైవ ప్రస్థావన, అల్లాహ్ తఆలాతో సంబంధము ఏర్పరచుకొనుట, అతనితో ప్రేమ కొరకు అల్లాహ్ తఆలా లక్షణములను గమనించవలెనని, ఆయా లక్షణముల ద్వారా సంబంధమును పెంచుకోవలెనని తెలుపుచుండిరి. అప్పుడే అల్లాహ్ తఆలా ప్రేమ సరియైన భావము తెలియును. ఇహలోకములో కూడ ఎవరిని ప్రేమింతురో వారితో సాన్నిహిత్యమును పెంచుకొనుట ఒక ప్రాథమిక సూత్రము. కనీస ఇష్టము, సంబంధము బహిర్గతమగుటకు అతని చిత్ర పటము లేదా చిత్రము ముందుండవలెను. ఈ విషయమును తెలుపుచు వారిట్లనిరి. ఉదా॥ ఇస్లాం చెప్పిన ఒకరి ఉనికి ముందుండుట లేదా అతని చిత్రము ముందుండుట ప్రేమ కొరకు తప్పనిసరి. ఇది క్రొత్త విషయము కాదు. నేటి కాలములో వివాహ సంబంధము కొరకు చిత్రము పంపవలెనని అందురు. వివాహము చేసుకొను ముందు ముఖము చూడమని ఇస్లాం తెలిపెను. ముఖము చూడుటకు కష్టమైనచో నేటి కాలములో చిత్రము చూసేది, ఇప్పుడు కూడ చూడవచ్చును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నకు వ్యతిరేకంగా ప్రజల హృదయాలలో ఎలా కోపము, కుట్రను నింపుటకు రెచ్చగొట్టేవారో అహ్మదీయేతర మౌల్వీల ఒక సంఘటన ఇప్పుడు తెలిపెదను. ఎలా అబద్ధమాడేవారు, ఇప్పుడు కూడ అబద్ధమాడుచున్నారు. వారిపై ఎటువంటి నిందలు మోపుచున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను వీరు మంత్రగాడని అనేవారని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలిపిరి.

ఒక మిత్రుడు ఇట్లు వినిపించినట్లు నాకు గుర్తున్నది. ఫిరోజ్‌పూర్ ప్రాంతములో ఒక మౌల్వీ ప్రసంగించుచుండెను. అహ్మదీయుల పుస్తకములు అసలే చదవకూడదు, ఖాదియాన్‌కు పోనే పోకూడదు. తన మాటను బలపరచుటకు ఈ పచ్చి అసత్యుడు తన ఒక కల్పిత సంఘటన కూడ వినిపించెను. కాని అల్లాహ్ తఆలా కూడ కొన్ని సార్లు సంఘటన స్థలంలోనే వారి అసత్యమును బహిర్గతపరచును. ఇక్కడ కూడ అదే సభలో ఇలాగే జరిగెను. ఒక అహ్మదియేతర న్యాయవాది కూడ అక్కడ ఉపస్థితులై యుండిరి. కాని వారు అహ్మదియేతరులైనను మంచి స్వభావము కలిగియుండిరి. వారు ఒకప్పుడు చికిత్స కొరకు ఇక్కడికి ఖలీఫా అవ్వల్ (రజి) వద్దకు వచ్చి యుండిరి. వారిట్లనిరి. నేను అహ్మదీ కాదని మీకు తెలుసు. కాని నేను స్వయముగా చికిత్స కొరకు అక్కడికి వెళ్లినాను. అక్కడ యున్నాను. మౌల్వీ చెప్పిన విషయములన్నియు తప్పుల తడకే. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఇక్కడ మంత్రములున్నవని ప్రజలు ఇప్పటికి భావింతురు. దీనికి కారణమేమనగా ఈ జమాఅత్‌లోని చేరిన వారికి దెబ్బలు పడినట్లు, దూషించబడినట్లు, అవమానించంబడినట్లు, ధన నష్టము వాటిల్లినట్లు వారు చూచెదరు. అయినను వీరు విశ్వసనీయత కలిగియుందురు. అహ్మదియ్యత్‌ను వీడరు, దెబ్బలు, దూషణలు, నష్టముల వలన వారు భయపడవలెనని వారు భావింతురు. కాని వీరిపై ఏమియును ప్రభావము చూపదు. ఏదో మంత్రమున్నందు వల్లనే వీరు విశ్వాసముపై నిలకడగా యుందురు. అల్లాహ్ తఆలా ఈ అసత్య మౌల్వీల నుండి కూడ సమాజమును రక్షించుగాక! సత్యమును గ్రహించు అనుగ్రహము ప్రజలకు కలిగించుగాక! మనము కూడ మన బాధ్యతలను అర్థము చేసుకొనే విధముగా అనుగ్రహించు గాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ గౌ॥ సకీనా నాహీద్ తండ్రి కీ॥శే॥ ముహమ్మద్ దీన్ గారు, గౌ॥ షౌకత్ ఘనీ షహీద్ తండ్రి ఖాజీ అబ్దుల్ ఘనీ గారి సద్గుణములను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

❀❀❀

BOOK POST (PRINTED MATTER)

To,

.................................................................

.................................................................

.................................................................